# కవితా కౌముది

## మూడు చేపల కథను

కొండపల్లి నీహారిణి

నేను ఒక కథను
నాలో దాగిన మూడు సంఖ్య అనేకార్థాల సలపరింత!
చేపలు ,మడుగు,అడుగుల కథనునేను
నీతికి నాకూ-మబ్బులు కడలిల
బంధమంతటి బంధాల కథను .
క్షణాల్ని కుట్టుకుంటూ వెళ్ళేఅక్షరాన్ని,
అక్షరాల్ని పేర్చుకుంటూ చేరే శబ్ధాన్ని.
దారప్పోగుల కూర్పులదారి
సూదికి తెలుసన్న నమ్మకాన్ని.
నమ్మకాన్ని కుప్పపోసి చూడ గుట్టనయ్యే నిజాన్ని !
సమస్తజనావళి ,నా గాధావళి!
చెట్లుచేమలు, పచ్చగనవ్వే కొండగట్టులు
భద్రగిరులూ కలియతిరిగే నరులవంటి
కథను ,కథలేవో చెప్పేప్పుడు
కథలో కథనయ్యే కథను.
అన్నమో,చదువో పంచమనే కథను.
పాఠాల పరుగులలో ఇంటినుండి బడికో
బడినుండి గుడికో
గుడి నుండి గుండెకో
ఎడతెగని ప్రయాణాల కథను.
పక్కవాడిని పరీక్షరాసేప్పుడు చూడొద్దన్నది నేర్పే గట్టితనం ,
రేపటి పనిని ఇవ్వాళ, ఇవ్వాల్టిపని ఇప్పుడేన్న సుమతి తథాగత
కథాగతి
మూడుచేపలకథను , కాలమతి, మందమతి వ్యథాగతిని.

మడుగునుండి చెరువుకో, చెరువునుండి సంద్రానికో అడుగుల
కథను, కదలికను.
అడవి తల్లి అయినట్టు, అక్కడంత అన్నల ఆప్యాయతున్నట్టు,
గుట్ట రాళ్ళు
గుళ్ళైనట్టు అక్కలపేర్లు వెలసినట్టు
హృదయరణరంగంపై కొట్లాలన్ని తీరినట్లు,మొక్కుల కుప్పలన్ని
బంగారమైనట్టు నిజదర్శన కథను.
వాగు తడి ఆరని దుఃఖగీతాలు పారినట్టు ఏవేవో కథలు, కథలుగా
హృదయాలనుచేరే చేపలవంటి కథను
నేను కథను నిజాల రెప్పల్ని చీల్చే కథను
మరణించి మళ్ళీ జీవించ మహానమ్మకమై న కథను. మోసిన
విశ్వాసమంతా మేకులు దింపిన కథను.
ఆకలీ ,అన్నమూ నేల ఋణమూ
కౌమార గమన దీర్ఘసూత్రతనూ,
యవ్వనసంగతి ,గగనకుసుమమై న ప్రాప్తకాలజ్ఞ తను , కథను.
చావోరేవో తెలిసేదాకా ఆకాశపు వాకిలిలోని యద్భవిష్యత్ ను.
మాలోమేముగ , మనలోమనముగ
త్రికరణబద్ధులం కావాలనే కథను ,
శుద్ధ వ్యథలను పుక్కిటబెట్టిన
జనావళి కథను
నేను మూడు చేపల కథను!

★★★

# దుష్టసంహారం

శ్రీనివాస్ బందా

పేజీలకి ముందు..
ఎన్నో అబద్ధాల్ని అద్దంలో దర్శిస్తూ
అద్దమే అంతటా వ్యాపిస్తూ
అవని మొత్తం కాళ్లక్రిందే ఉన్న
అతివాంఛాభారంతో రెప్పలు బరువెక్కిన
అహంకారపుటంచుల్
అతిశయాల చూపుల్
వెర్రెక్కించే మోహం
కిర్రెక్కించే మదంలోంచి

..బయటపడలేక భ్రమలు విడలేక
లోపలి ముఖం కనిపించినా కనలేక
తగుల్తున్నా తన్నుకుంటూ
పగుల్తున్నా పళ్లికిలించుకుంటూ

..మొత్తానికో వెలుగురేక తడి సోకి

..ఒక్కో పేజీ తిప్పుతున్న కొద్దీ
ఒక్కో మెట్టూ దిగుతూ
కణం కణం ఇంకుతున్న కొద్దీ
ఒక్కో క్షణం ముద్రించబడుతూ
ప్రతి పదమూ సందేశమై
మది నిండా వెలుగుతూ
ఎప్పటికప్పుడు కళ్లు విప్పార్చుకుని
వర్తమానంలో వాస్తవాల్లో
నవజ్ఞానరేఖల్లో తడిసి మెరుస్తూ
హృదయాంజలి ఘటిస్తూ మోకరిల్లుతూ
..
దీపానికే కాక
వెలిగించిన చేతికీ మ్రొక్కుతూ..

★★★

# ఇద్దరు

## వారాల ఆనంద్

ఇద్దరు
ఒకరిని ఒకరు పలకరించుకోవడం
ఎంత బాగుంటుంది
చూపులతో నయినా
రెండు మాటలతో నయినా

లేత కిరణాలు
ఆకులనీ పువ్వుల్నీ పలకరించినట్టు
+++

ఇద్దరూ
ఒకరిని ఒకరు తెలుసుకోవడంలో
ఎంత వెలుగుంటుంది
సుఖం లోనూ దుఖం లోనూ
విజయం లోనూ ఓటమిలోనూ

ఇసుక తిన్నెల పైన
నీటి దారాలు అల్లినట్టు
+++

ఇద్దరూ
ఒకర్ని ఒకరు ప్రేమించుకోవడం
ఎంత హాయిగా వుంటుంది
నిద్దట్లోనూ మెలకువలోనూ
కలల్లోనూ అన్ని కాలాల్లోనూ

కెరటాలు ఉప్పొంగి
ఆర్తిగా తీరాన్ని తాకినట్టు
+++

ఇద్దరూ
ఒకర్ని ఒకరు  ఓదార్చుకోవడం
ఎంత ధీమాగా వుంటుంది
ఒంటరైనప్పుడూ ఓడిపోయినప్పుడూ
నిలబడలేనప్పుడూ కూలిపోయినప్పుడూ

ఎండిన గుండెల్లో
తడేదో కురిసినట్టు
+++

ఇద్దరూ
ఒకరి కోసం ఒకరు ఎదురు చూడడం
ఎంత ఆర్తిగా వుంటుంది
చీకట్లోనూ వెలుతురులోనూ
స్నేహంలోనూ మోహంలోనూ

సూర్యుడు చంద్రుడి కోసం
చంద్రుడు సూర్యుడు చూసినట్టు

★★★

## నిర్బంధం
### సుధాకర్ క్రొవ్విడి

అనంతమైన ఆలోచనల్నించి
అవిశ్రాంతంగా సాగే ఊహలనుంచి
మూసిన రెప్పల వెనుక మెదిలే స్వప్నంలో
నిర్మించే ఆశాసౌధాల్నించి
మనసుని మళ్లించడంకాదు
నిర్బంధమంటే

నీదేమో నవయవ్వన ప్రాయం
చుట్టూచూస్తే రంగులలోకం
రారమ్మని ఆకర్షించే వ్యసనం
నీకై నువ్వు విధించుకున్న
స్వీయనిర్బంధమే నీకిక కవచం

పెదవిదాటబోయే పరుషమైన పదాన్ని
చిరునవ్వుచాటున దాచిపెట్టడం
రక్తంమరిగే ఆవేశాన్ని
చల్లనిచూపు మాటున అదుపుచెయ్యటం
ఇదేగా నిర్బంధం

కళ్లెంలేని గుర్రంలా పరుగెత్తే కోరికలకు
నైతికత గీసిన లక్ష్మణరేఖగా
నిర్బంధమంటే

శత్రువు కవ్వించినా కంచెదాటని
సైనికుడి సహనం
శాంతినికాపాడే నిర్బంధం

అదుపుతప్పిన సమాజం
అనాగరికమైన బాటలోకి మరలినప్పుడు
నిర్బంధమూ నిత్యావసరమేగా

★★★

## గజల్
### వాసుదేవమూర్తి శ్రీపతి

దొరకవోయి ఆకాశపు అంచులెంత వెతికినా!
దొరకదోయి చందమామ నీడనెంత వెతికినా!

ఏ ఆశా లేకపోతె ఆనందం అనంతం!
దొరకదోయి ఆశలేని హృదయమెంత వెతికినా!

ఎన్ని సెగలు, ఎంత దిగులు, నిశి మోసే వ్యధలెన్నో
బాధ దాచుకోని రేయి చిక్కదెంత వెతికినా!

మనసుపైన గాయాలను కాలం మాన్పుతుందా?
దొరకవోయి మరపురాని బాధలెంత వెతికినా!

నీతులేవి బోధించవు ఈ శ్రీపతి రాతలు!
అనుభవాలె దొరుకుతాయి నువ్వు ఎంత వెతికినా!

★★★



# మనసు అంటే..

చందలూరి నారాయణరావు

ఎప్పుడైనా
మనసు అందాన్ని చూసావా?
చూసి పలకరించవా?
తాకి తన్మయత్వాన్ని పొందావా?

బాధలో బాధ్యతలా
ఒంటరిలో ఓర్పుగా
ఎడబాటు ఎరుగని
సంచారిని ఎరుగుదువా?

సముద్రమంత భావాన్ని
మౌన భాషలో
ఆకాశమంతా వినిపించేలా
మాట్లాడం విన్నవా?

కాలమేదైనా చుక్క చప్పుడు లేకుండా
ఉధృతగా ప్రవహించడం,
దరికి చేరకుండానే దప్పిక తీర్చడం
చూసావా?


చీకటి వేళలో
వెలుగు ముక్కను కరచుకొన్న
ప్రేమ పావురం
భుజం మీద వాలడం జరిగిందా?

బాధలో ,బరువులో
పగటిలో, చీకటిలో
అతుకులో, పగులులో
ఓ చేయి మృదుత్వం తెలుసా?

మనిషి మనిషిలో
కంటికి కనపడకుండా
కలను పండిస్తున్న
"మనసు"ఓ అద్భుతభావం

మనసు మనసుతో
ఎదుట లేకుండా
ఎదురు రాకుండా
ఎదను పాలించడం
ఓ అమృతరావం.

★★★



# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

ఇది రసాత్మకమని మధురదరహాస
భరితజీవితమని యెద మురియుచుండు
ఇది విషాదాత్మకమని నా హృదయసౌధ
భిన్నకారకమని యుర్వి చెప్పుచుండు

ఎంత చెప్పిన నా మనసెపుడు వినదు
ఎండమావులలో నీటికెదురు చూచు
కోరు వార్షుకాభ్రములనెడారి యందు
బండరాయిలో వెదకు జీవమ్ముకొరకు

ఇది యసందర్భమో లేక హృదయమందు
పాదుకొనిన యాశావాద పాదపమ్మొ
వేచియుందును తూర్పున వెలుగు కొరకు
అలమటింపను సతము నిరాశ యందు

ఎంత వెదకిన కానరావెచట నీవు
నీ చరణచిహ్నముల కాననేరనెచట
కనుల చూచునదెల్లను కాదు నిజము
నిజము కానోపు చూడని నీదు మూర్తి

పలుకరించి వెడలిన పూబాల నీవు
కదలిపోయిన నిన్నెట్లు కాంచగలను
అలరుగంధము మేనెల్లనలదికొనిన
యనిలమిటువచ్చి నిజము నీవనుచు తెలిపె

COMMENTS